# డామ్ మొరేస్

## శ్రీ ఎస్. వెంకట్‌నారాయణ్

డామ్ మొరేస్ 'గోధుమవర్ణపు ఆంగ్లేయుడు.' ఆయన్ను అంతా ఇండో-ఆంగ్లియన్‌కవి అంటారు. అట్లా అనిపించుకోవడం ఆయనకు ఇష్టంలేదు; కాదు. భారతదేశంవారు ఆయన్ను భారతీయుడని అంటారు. అది ఆయనకు అదోరకంగా వుంటుంది; కోపాన్ని తెస్తుంది. ఆయన ఈ దేశాన్ని వదిలి పెట్టేశాడు; తల్లిని వదిలి పెట్టేనట్లు; ఇది జరిగి చాలా ఏళ్లయింది మరి.

ఆయనకు పట్టరానికోపం – ఎక్కడఅంటే, ఎందుకుఅంటే–'ఈ భారతదేశం నాకు ఏమిచేసింది? ఏమి ఒరిగించింది? నాకు అడ్డంరావడం తప్పు?' ఇది ఆయన ప్రశ్న. చాలా ఇదైపోయి ఆయన ఈ ప్రశ్న వేస్తాడు.

'ఇండో-ఆంగ్లియన్ కవివి నువ్వు అని ఎవరైనా అంటే, నాకు మహాచెడ్డకోపం వస్తుంది' అంటారు ఆయన.

ఐరోపాలో, అమెరికాలో ఆయన్ను అంతా ఇంగ్లీషుకవి అనే అంటారు. ఆయన భారతదేశంలో జన్మించినమాట నిజమే 'అయినా వారూ వీరూ నన్ను - ఇంగ్లండులోని, అమెరికాలోని- నా సహపాఠి వారికన్న భిన్నంగా భావించవలసిన, అనుకోవలసిన అవసరం ఏమి వచ్చిపడింది? ఈ దేశంలో నా కవిత్వాన్ని గురించి తీర్పు చెప్పడానికి వేరురకం మానదండాన్ని వీరంతా ఎందుకు ఉపయోగించాలి? అని గూడా డామ్ మొరేస్ ప్రశ్నిస్తాడు.

ఇప్పుడు ఆయనకు ముప్పై వసంతాలు నిండాయి. ఇటీవలనే ఆ ముప్పయ్యో పుట్టిన రోజు పండుగ చేసుకున్నాడు. తన ఆత్మకథను ప్రకటించాడు. ఇప్పుడు భారతదేశంలో వున్నాడు. ఇంకో పుస్తకంకోసం సమాచారాన్ని సమకూరుస్తున్నాడు. ఆయన భారతదేశానికివచ్చి పూర్వం ఒక పది సంవత్సరాలు దాటిపోయింది. అక్రిందటిసారి ఇక్కడకు వచ్చినప్పుడు 'గాన్ ఎవే' అన్న పుస్తకాన్ని వ్రాశాడు. అదో తగాదా గ్రంథం అయిపోయింది. తాను కలుసుకున్న మనుష్యులను గురించి, చూచిన స్థలాలనుగురించి ఆయన వ్రాసినవ్రాతలు అట్లా వున్నాయి. మరి ఆ పుస్తకం అట్లా ప్రసిద్ధికెక్కింది.

ఇప్పుడు ఆయన నేపాలును సిక్కింను చూచుకొని భూటాన్‌ను దర్శించి భార్యతో బిడ్డతో భారతదేశం తిరిగివచ్చాడు. పాకిస్తాన్ ప్రభుత్వం గూడా ఆయన్ను రమ్మంది. ఓ పుస్తకం వ్రాయమన్నది. అధ్యక్షుడు అయూబ్‌ఖాన్‌తో ఆయన గోష్ఠికి ఏర్పాట్లు గూడా జరిగాయి. మరి అక్కడ పరిస్థితులు కొంచెం చల్లబడటంకోసం డామ్ మొరేస్ నిరీక్షిస్తున్నారు.

డామ్ మొరేస్ నిరాడంబరమైన పద్ధతులుగల మనిషి. హెచ్చులులేవు. మెత్తనివాడు. కొంచెం బిడియపడుతూ వుంటాడు. శిరోజాలు దీర్ఘంగా పెంచి పెట్టుకున్నాడు (తన ఆత్మకథలో ఈ విషయం వ్రాసుకున్నాడు: లండన్‌లో, పారిస్‌లో మొదట్లో హోమోసెక్సుయల్‌లు నన్ను వేటాడారు: అని)

డామ్‌మొరేస్ మాట్లాడితే గంభీరంగా వుంటుంది. కాని బిగ్గరగా మాట్లాడడు. నెమ్మదిగా మాట్లాడుతాడు: వింటుంటే మాటలు ఊదుతున్నాడా, రహస్యాలు చెబుతున్నాడా అన్నట్లు వుంటుంది. ఉగ్రస్వభావం ఎక్కడా కన్పించదు. నిస్సిం ఎజికిల్ ఎంతటి మెత్తనిమనిషో డామ్‌గూడా అంతే డామ్ మాట్లాడ్డం వింటూవుంటే, ఈమనిషి కవిత్వం ఏమివ్రాస్తాడు; లోకాన్ని గగ్గోలు కొట్టించే వ్రాతలు ఏమివ్రాస్తాడు! అని అనిపిస్తుంది.

# డామ్ మొరేస్

నేను ఇటీవల డామ్‌ను ఢిల్లీలో కలుసుకున్నాను. ఇద్దరం మాట్లాడుకున్నాం — పొగ త్రాగుతూ; ఆపవం సేవిస్తూ. అదో మూడుగంటల ముచ్చట.

డామ్ కవి. అందులో సందేహం ఏమీలేదు. ఎప్పుడూ కవిత్వం ఒక్కటే వ్రాయాలని అతను అనుకుంటాడు. 'మరి కవిత్వంఒక్కటే వ్రాస్తే గడుస్తుందా. గడవదు.' ఇంగ్లండులోగూడా అంతే. అందుచేత డామ్ మొరేస్ వచనంగూడా వ్రాస్తాడు. బి.బి.సి. కి స్క్రిప్టులు వ్రాసి ఇస్తాడు. ఆ గద్య వ్రాతకు రోజుకు ఆరుగంటలు వినియోగం చేస్తాడు. ఆత్మకథ వ్రాసుకోడానికి డామ్‌కు ఆరు నెలలు పట్టింది. ప్రకటన ఆలస్యం అయింది. 'లాయరు భయపడ్డాడు. పరువునష్టం దావాలు, అవీ పడతాయని అన్నాడు' అన్నాడు.

లండన్‌లో అతనికో ఇల్లువుంది. సంవత్సరానికి ఎనభైవేలరూపాయలదాకా ఆర్జన వుంది. నేను ఆయన్ను కలుసుకొన్న రోజున ఒకవ్యాసం పూర్తి చేశాడు. న్యూయార్కు టైమ్సుకు. డెయిలీ టెలిగ్రాఫ్‌కుగూడా వ్యాసాలు వ్రాస్తున్నాడు. వ్యాసానికి 200 పౌనులు – అంటే 4000 రూపాయలు— ఇస్తారు.

భారతదేశంలో పుట్టి అక్కడ ఇంగ్లండులో వుంటున్నవారిలో డామ్‌కు ఆట్టేమంది స్నేహితులేరు—వి. ఎస్. నైపాల్, వేద్ మెహతాలు వినా. అక్కడ ఆయనకు ఎదురయ్యేవాళ్ళ కవులో, రచయితలో, జర్నలిస్టులో—అంతే. 'మరి అటువంటి వాళ్ళు అక్కడ ఆట్టేమందిలేరు' అంటాడు డామ్.

'ఈ పదిసంవత్సరాల్లో దేశం ఎంతో అభివృద్ధి పొందిందయ్యా!' అన్నాడు డామ్. గ్రామాలు మహాపచ్చగావున్నాయి. ట్రాన్‌సిస్టర్లుగూడా వినిపిస్తున్నాయి—అన్నాడు.

ఇంగ్లీషులో రచనలుచేసే భారతీయులువున్నారు; వారినిగురించి డామ్ ఏమి అనుకుంటున్నాడు?

'చెప్పమంటావా! నేను ఏమీ అనుకోను. అసలు ఆలోచించను. (పిడిపిల్లవాడిలాగా నవ్వుతాడు డామ్ అల్లరిగా).

వీరి పుస్తకాలు లండన్‌లోగూడా దొరుకుతాయి. దొరికినవన్నీ డామ్ చదువుతాడు. మరి వారిలో ఎంతమంది లెక్కకు వస్తున్నారు! కొద్దిమంది. భారతదేశంలో చెప్పుకోతగినంత బాగా వ్రాసేవాళ్ళు ఆట్టేమంది లేరులే – అన్నాడు.

—ఆర్. కే. నారాయణన్ ఇప్పుడిప్పుడు చేస్తున్న రచన వట్టిచప్పగావుంటున్నది.

—కుశ్వంత్ (అవును, అవును సింగ్) బాగా వ్రాస్తున్నాడు.

—నీరద్ సి. చౌధురి—ఆ మనిషి అంటే నాకు గిట్టదు. రచనమాత్రం బాగుంటుంది.

—రాజారావ్! ఇప్పుడు అతను ఎక్కడ వుంటున్నాడు. అతను వ్రాసిన 'సర్పెంట్ అండ్ ది రోప్' చదివాను. చూడు, మంచిగూఢవేదాంతివి, గొప్పవ్రాయసగాడివి కావడం యుగపత్తుగా జరిగే పనికాదు. ఇది నా అభిప్రాయం.

ఇవి డామ్ అభిప్రాయాలు.

కవులలో పదార్థేతరసిద్ధాంతులు వున్నారు. డామ్‌కు వారంటే ఇష్టం. జాన్ డోన్, జార్జి హెర్బర్ట్—డామ్‌కు ఇష్టమైన కవులు.

రొమాంటిక్స్‌లు, డామ్‌కు నచ్చరు. ఒక్క బైరన్‌తప్ప.

'షెల్లీ అంటే నాకు అసహ్యం.'

'కీట్స్—ఆయన ఉత్తరాలు బాగుంటాయి.'

'మరికొంతకాలం—ఒక 45 ఏళ్ళు వచ్చేదాకా బ్రతికివుంటే, కీట్స్ ఏమి వ్రాసేవాడో! అట్లా ఆలోచిస్తేనే అందంగా వుంటుంది.'

ముందురోజుల్లో డామ్ కవిత్వం చదివే పని పెట్టుకున్నాడు. తర్వాత అది విసుగైపోయింది. 'మనిషి పెరుగుతూవున్నకొద్దీ అహంకారం తగ్గిపోతుంది. నువ్వేమంటావోగాని' అన్నాడు.

డామ్‌మొరేస్ శ్రీమతి గాంధీని కలుసుకున్నాడు. 'ఆమె విచిత్రమైన వ్యక్తి. కాని ఆమె తండ్రితో గోష్ఠికన్నా, యీామెతో గోష్ఠి తేలిక.'

డామ్ మొరేస్ దలైలామాను కలుసుకున్నాడు 'టిబెటన్‌కవిత్వాన్ని ఇంగ్లీషులోనికి మార్చమని ఆయన నన్ను కోరారు.'

ఎప్పుడైనా డావ్ ఎల్. ఎస్. డి అవలంబనం చేశాడా ? ఆ, ఒక్కసారి. అదో ప్రయోగపరీక్ష. 'నాకేమీ కాలేదు.'

అమెరికా డావ్‌కు నచ్చలేదు. భార్యతో, కుమారునితో నిరుడు ఆదేశం వెళ్ళివచ్చాడు. ఏనాక్ పవెల్ ఎమిగ్రెంట్లను గెంటివేసేయగల్గిననాడు, తాను వుండటం అమెరికాలోనేనని డావ్ ఇటీవల ఒక టెలివిజన్ గోష్ఠిలో ఖుశ్వంత్‌సింగ్‌కు చెప్పాడు.

అయితే పవెల్‌కు అంతవిజయం లభిస్తుందని అతను అనుకోడంలేదు.

'అయినా నాకు అమెరికాలో చాలామంది స్నేహితులు వున్నారు.'

లండన్‌లో జీవితం వుంది. ఢిల్లీలో జీవితం వుంది. తేడా ఏమిటి? ఎట్లా అనిపిస్తుంది? రచయిత అయినవాడికి 'లండన్ ఓ పెద్దసరస్సు; అందులో ఆ రచయిత ఒక పెద్దచేప. ఢిల్లీలో అంటారా, అక్కడ జీవితం రచయితకు చిన్నసరస్సులో పెద్దచేప పద్ధతిగా వుంటుంది.

సోహోకు డావ్ ఇంకా వెడుతూనే వున్నాడా! లేదు. ఆక్స్‌ఫర్డ్ రోజుల్లో అయితే ఎక్కువగా వెళ్ళేవాడు ఇప్పుడు అట్టే వెళ్ళడంలేదు. అడపా దడపా పోతూవుంటాడు ఇప్పుడు డావ్ గొప్పవాడు. ప్రసిద్ధుడు. మరి ఇప్పుడు గౌరవప్రదం అనిపేరు తెచ్చుకున్నచోట్లకు వెడుతూవుండాలి. ఈమాటచెప్పి డావ్ ఒకనవ్వు నవ్వాడు. ఆడపిల్ల నవ్వినట్లు.

జూడిత్ కల్పించుకున్నది. 'ఇప్పుడు డావ్ కొంచెం బుద్ధిమంతుడైనాడు లెండి' అన్నది.

జూడిత్ డావ్ భార్య. అందమైన స్త్రీ: నీలపు కళ్ళు:

ఆమె ఆమాట అనగా మేమూ నవ్వేశాము. నేమా, జూడిత్.

డావ్ గూడా మాతో కలిసి నవ్వేశాడు. అసహాయుడైన చిన్నపిల్లవాడిలాగా.

---

